ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
సోమవారం, 12 ఆగస్టు 2024 www.prajaaswaramdaily.com 2 PM

# సాగు ఆగమైంది..

## వ్యవసాయానికి గడ్డుకాలం..

## ఎక్స్‌లో కేటీఆర్ ట్వీట్



హైదరాబాద్, ఆగస్టు 12 (ప్రజాస్వరం): తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయానికి గడ్డుకాలం ఎదుర్కొనే పరిస్థితి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో ఏడాది కాలంలోనే 15.30 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు. దేశానికి ఆదాయ అన్నపూర్ణగా ఎదిగిన రాష్ట్రంలో ఎనిమిది నెలల్లో ఇంత విధ్వంసం ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు భద్రత లేదని విమర్శించారు. బురద రాజకీయాలకు అతీతంగా సకాలంలో సాగునీరు అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయని, చేతలు మాత్రం సచివాలయం గేటు దాటడం లేదన్నారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు అన్నదాతల పరిస్థితి మరీ దయనీయంగా ఉందని కేటీఆర్ ట్వీట్ చేశారు.

### కేసీఆర్ పాలన సాగుకు స్వర్ణయుగం..

కేసీఆర్ పాలనలో సాగుకు స్వర్ణయుగం.. కాంగ్రెస్ రాగానే వ్యవసాయానికి గడ్డుకాలం.. అని పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ సర్కార్ చేసిన.. కమాల్.. తెలంగాణలో సాగు విస్తీర్ణం కళ్ళముందే.. ధమాల్ అని తెలిపారు. ఒక్క ఏడాదిలోనే.. 15.30 లక్షల ఎకరాల్లో తగ్గిన సాగు విస్తీర్ణం.. ఆగమైతున్న తెలంగాణ రైతు బతుకుకు.. తొలి ప్రమాద సంకేతం..! అన్నారు. దశాబ్ద కాలంలోనే.. దేశానికే అన్నపూర్ణగా ఎదిగిన తెలంగాణలో.. ఎనిమిది నెలల్లోనే.. ఎందుకింత వ్యవసాయ విధ్వంసం..? అని ప్రశ్నించారు. సంతోషంగా సాగిన సాగులో.. ఎందుకింత సంక్షోభం..?? అన్నారు. మొన్న.. వ్యవసాయానికి కరెంట్ కట్.. నిన్న.. రుణమాఫీలో రైతుల సంఖ్య కట్,, నేడు.. సాగయ్యే భూమి విస్తీర్ణం కట్ అంటూ విమర్శించారు. రుణమాఫీ అని మభ్య పెట్టి.. పెట్టుబడి సాయన్ని ఎగ్గొట్టడం వల్లే.. రైతులకు ఈ అవస్థ.. అన్నారు. రూ.500 బోనస్ అని.. నిలువునా మోసం చేసింది ఈ కాంగ్రెస్ వ్యవస్థ.. అన్నారు.

### మాటలు కోటలు దాటుతున్నయ్..

ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నయ్..కానీ చేతలు సచివాలయం గేటు దాటడం లేదని విమర్శలు గుప్పించారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు.. అన్నదాతలది అత్యంత దయనీయ పరిస్థితి..అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును వాడుకునే విజన్ లేదు..రిజర్వాయర్లు నింపే ప్రణాళిక లేదు..చెరువులకు మళ్లించే తెలివి లేదన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే.. కాంగ్రెస్ పాలనలో.. రైతు బతుకుకు భరోసానే లేదని మండిపడ్డారు. బురద రాజకీయాలు తప్ప.. సమయానికి సాగు నీళ్లిచ్చే సోయి అసలే లేదని తెలిపారు. ఎరువులు–విత్తనాల కోసం రైతులకు తిప్పలు.. క్యూలైన్ లో పాసుబుక్కులు, చెప్పులు.. అన్నారు. కొత్త రుణాల కోసం బ్యాంకుల వద్దే.. పగలూ రాత్రి తేడాలేకుండా పడిగాపులన్నారు. అప్పుల బాధతో..అన్నదాతల ఆత్మహత్యలు.. కౌలు రైతుల బలవన్మరణాలు.. ఇలా.. ఒకటా.. రెండా.. సాగు విస్తీర్ణం తగ్గడానికి కారణాలు.. సవాలక్ష !! అంటూ ఎక్స్ వేదికగా కేటీఆర్ మండిపడ్డారు.

## కాంగ్రెస్ నేతలు..

# పరాన్నజీవులు

### సీతారామ ఎత్తిపోతల పథకం కేసీఆర్‌కు ఇష్టమైన ప్రాజెక్ట్

90 శాతం పనులు మేమే చేశాం

తామే పూర్తి చేశామని కాంగ్రెస్ గొప్పలు

పనులు పూర్తయ్యాక మంత్రులు పోటీపడి పర్యటనలు

వారి ప్రవర్తన చూసి జనం నవ్వుకుంటున్నారు

60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఖమ్మం జిల్లాకు చుక్కనీరు ఇవ్వలేదు

మాజీ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, ఆగస్టు 12 (ప్రజాస్వరం): కాంగ్రెస్ నేతలు పరాన్న జీవులుగా ప్రవర్తిస్తున్నారని, వారి ప్రవర్తనతో ప్రజలు నవ్వుకుంటున్నారని మాజీ హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. ఇవాళ హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీతారామ ఎత్తిపోతల పథకం కేసీఆర్‌కు చాలా ఇష్టమైన ప్రాజెక్ట్ అని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 90 శాతం పనులు పూర్తయిన ప్రాజెక్ట్‌ను కాంగ్రెస్ నేతలు తామే కట్టినట్లుగా చెప్పుకోవడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోపే సీతారామ ప్రాజెక్ట్ కాంగ్రెస్ సర్కార్ పూర్తి చేసిందా.. అంటూ సెటైర్లు వేశారు. హస్తం పార్టీ నేతలు పరాన్న జీవులుగా తయారయ్యారని, వారి ప్రవర్తన చూసి జనం కూడా నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా.. ఖమ్మం జిల్లాను కరువు కోరల్లోంచి బయటకు తీసుకొచ్చేందుకు సీతారామ ప్రాజెక్ట్ కట్టాలని కేసీఆర్ ఆనాడే సంకల్పించారని గుర్తు చేశారు. జిల్లాలో ఇవాళ అన్ని పనులు పూర్తయ్యాక మంత్రులు పోటీపడి మరీ పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలా ఒక్కటి కాదు.. తాము పరీక్షలు నిర్వహించిన ఉద్యోగాలను సైతం కాంగ్రెస్ ప్రభుత్వమే ఇచ్చిందని ఆ పార్టీ నేతలు గొప్పలు చెప్పుకోవడ హాస్యాస్పదంగా ఉందన్నారు. కేసీఆర్ కాకుండా సీతారామ ప్రాజెక్టును వేరే వారు రూపకల్పన చేసి ఉంటే అంత బాగా ఫలితం వచ్చేదా అని ప్రశ్నించారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఖమ్మం జిల్లాకు చుక్కనీరు కూడా ఇవ్వలేదని, ఇవాళ అదే జిల్లాలో రెండు పంటలు పండేలా కేసీఆర్ ఆ ప్రాజెక్టును రూపకల్పన చేశారని పేర్కొన్నారు. వందేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ప్రాజెక్టును నిర్మించామని పేర్కొన్నారు. మొత్తం 8 ప్యాకేజీల్లో 5 బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందని, మరో మూడు ప్యాకేజీల్లో 80 శాతం పనులు తమ ప్రభుత్వమే పూర్తి చేసిందని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

## నేలకొండపల్లిలో టూరిజానికి

# రూ. 10 కోట్లు

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

### నేలకొండపల్లి బౌద్ధ స్తూపం సందర్శన



నేలకొండపల్లి, ఆగస్టు 12 (ప్రజాస్వరం): నిధుల విషయంలో డోకా అవసరం లేదని.. 10 కోట్లు కేటాయించారని పనులు ప్రారంబించాలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం బౌద్ధ స్తూపం వద్ద స్టేట్ టూరిజం ప్రాజెక్ట్ జిఎం జిల్లా అధికారులతో మంత్రులు బట్టి విక్రమార్క, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. పర్యటక స్థలాలను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా బౌద్ధ స్థపంలో మన ప్రాంతం చరిత్ర పుటలలో ఉందన్నారు. దేశంలోనే బౌద్ధ స్తూపిస్తులతో కలిసి అభివృద్ధి చేస్తామన్నారు. నిధుల విషయంలో డోకా అవసరం లేదన్నారు. 10 కోట్లు కేటాయింపు ... పనులు ప్రారంబించాలన్నారు. అర్కలాజికల్ డిపార్ట్మెంట్ తో కలిసి అభివృద్ధి అన్నారు. బౌద్ధిస్టూలతో కలిసి ఫెస్టివల్ పెట్టాలన్నారు. బుద్ధిజం బోధనలు పాశ్చాత్య దేశాలలో ప్రతి వారంలో రెండు రోజుల పాటు అమలు చేస్తారన్నారు. వారానికి ఒక రోజు బుద్ధిజం పేరుతో పర్యాటించాలన్నారు. మనమే ఆదర్శం కావాలని పిలుపునిచ్చారు. బౌద్ధ స్తూపం వద్ద పర్యాటక అధికారుల తో మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ.. బౌద్ధ స్తూపం ను పర్యాటకులకు అందించేందుకు ఏం చేద్దామన్నారు. ఎందుకు ఇంత కాలం నిర్లక్ష్యం చేశారన్నారు. ముఖ్యమైన బౌద్ధ స్థూపం కి పూర్వ వైభవం తీసుకుని రావాలన్నారు. 8 ఎకరాలు ను అభివృద్ధి చేయాలని తెలిపారు. స్థూపం కి లైటింగ్, నీటి లభ్యత, బోటింగ్ ఏర్పాటు కి సమగ్ర ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. బౌద్ధ స్థలాలు తక్కువ ఉన్నాయి.. తెలంగాణలో మూడు స్థలాలో పాలేరు కీలకమైనదన్నారు. సిబ్బంది కొరత, బడ్జెట్ లేదు అని అధికారుల వెల్లడించారన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీ నివాసరెడ్డి మాట్లాడుతూ.. దేశంలో నే మన బౌద్ధ స్థూపంకి ప్రాధాన్యత ఉందన్నారు. కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి అన్నారు. అండర్ గ్రౌండ్ లో ఇంకా స్థూపాలున్నాయన్నారు. టూరిజం లో బెస్ట్ ప్లేస్ కింద గుర్తించారన్నారు. నేలకొండపల్లిలో భక్తరామదాసు స్థానికులు... ఆయన నివసించిన ఇళ్ళని మ్యూజియంగా ఏర్పాటు చేయాలన్నారు. పాలేరు నియోజకవర్గం లో రిజర్వాయర్ ... కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి చెందిందని తెలిపారు.

## స్మితా సబర్వాల్ ట్వీట్‌పై హైకోర్టుకు

హైదరాబాద్, ఆగస్టు 12 (ప్రజాస్వరం): అఖిల భారత సర్వీసు ఉద్యోగాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ స్మితా సబర్వాల్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా చేసిన వ్యాఖ్యల వ్యవహారం హైకోర్టుకు చేరింది. దివ్యాంగుల పై అనుచిత వ్యాఖ్యలు చేసిన స్మితా సబర్వాల్ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని సామాజికవేత్త వసుంధర తెలంగాణ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. యూపీఎస్సీ చైర్మన్ కు ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్ లో కోరారు. ఈ పిటిషన్ పై విచారణ జరగ్గా పిటిషనర్ కు ఉన్న అర్హతను కోర్టు ప్రశ్నించింది. దీంతో పిటిషనర్ ఒక దివ్యాంగురాలు అని పిటిషనర్ తరపున లాయర్ కోర్టుకు తెలిపారు. దీంతో పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది.

## ఘోర రోడ్డు ప్రమాదం

### ముగ్గురు దుర్మరణం

హైదరాబాద్, ఆగస్టు 12 (ప్రజాస్వరం): బైక్ అదుపుతప్పి ముగ్గురు దుర్మరణం పాలైన విషాద ఘటన నగరంలోని చాంద్రాయణగుట్ట బండ్లగూడలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బైక్‌పై ముగ్గురు అతివేగంగా వెళ్తుండగా బండ్లగూడ ఆర్టీఏ కార్యాలయం ఎదుట అదుపుతప్పి ఒక్కసారిగా కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరు స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోగా.. స్థానికులు మరొకరిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## గంజాయి ముఠాకు చెక్

### భారీగా హాష్ ఆయిల్ పట్టివేత



హైదరాబాద్, ఆగస్టు 12 (ప్రజాస్వరం): తెలంగాణ, హైదరాబాద్‌లను మత్తు రహిత ప్రాంతాలు తీర్చిదిద్దేందుకు పోలీసులు ఎంతో కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా గంజాయి, డ్రగ్స్ వాడకం, అమ్మకాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలోనే సోమవారం తెల్లవారుజామున గంజాయి ముఠాను రాచకొండ కమిషనరేట్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి దాదాపు 13 కేజీల హాష్ ఆయిల్ పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. దాని విలువ మార్కెట్లో రూ. 11 కోట్ల వరకూ ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి జిల్లాకు చెందిన కొండబాబు, బాలకృష్ణలు హాష్ ఆయిల్ ను డబ్బాలో పెట్టుకుని బెంగళూరుకు తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. వీరి నుంచి గంజాయి నెటవర్క్ కు సంబంధించిన కూపీ లాగేందుకు ప్రయత్నిస్తున్నామని.. పోలీసులు మీడియాతో చెప్పుకొచ్చారు.

## మహానగరంలో

# ఆక్రమణలకు అడ్డుకట్ట

### హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు




హైదరాబాద్, ఆగస్టు 12 (ప్రజాస్వరం): ప్రభుత్వ ఆస్తులు, స్థలాలు, చెరువులు, కుంటలు, పార్క్ స్థలాలు, బఫర్ జోన్లలో భూ ఆక్రమణలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక ప్రకటన చేశారు. ఇవాళ హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. భూ కబ్జాలపై హైడ్రాకు వందల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో చెరువులు, కుంటలు అన్ని కలిపి దాదాపు 400 పైగానే ఉన్నాయని వాటి ఆక్రమణలపై ఎల్లప్పుడు నిఘా పెడతామని పేర్కొన్నారు. ఎన్ఆర్ఎస్‌సీ నివేదిక ప్రకారం 44 ఏళ్లలో చాలా చెరువులు కనుమరుగయ్యాయని గుర్తు చేశారు. అందులో చాలా చెరువు 60 శాతం, 80 శాతం ఆక్రమణలకు గురైనట్లుగా నిర్ధారించామని రంగానాథ్ అన్నారు. త్వరలోనే హైడ్రాకు ప్రభుత్వం పెద్ద ఎత్తున సిబ్బందిని సమకూర్చుతోందని, త్వరలోనే హైడ్రా నేతృత్వంలో ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీకి (హైడ్రా)కు అంకురార్పణ చేసింది. ఈ సంస్థకు చైర్మన్ స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చైర్మన్ వ్యవహరిస్తున్నారు. తాజాగా రాష్ట్ర బడ్జెట్‌లో హైడ్రా కార్యకలాపాలకు సర్కార్ రూ.200 కోట్లు కేటాయించింది.

# కవితకు నో బెయిల్

### మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరణ

### ఈడీ, సీబీఐలకు సుప్రీం కోర్టు నోటీసులు

### విచారణ ఆగస్టు 20కి వాయిదా



హైదరాబాద్, ఆగస్టు 12 (ప్రజాస్వరం): ఢిల్లి లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితకు మధ్యంతర బెయిల్ ఇచచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. కవిత పిటిషన్ పై ఈడి, సీబిఐ లకు నోటీసులు సుప్రీం కోర్టు జారీ చేసింది. కేసు తదుపరి విచారణ ఆగస్టు 20 కి వాయిదా వేసింది. నేడు సుప్రీం కోర్టులో కవిత కేసు విచారణ జరిగింది. మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. లిక్కర్ ఈడి, సీబిఐ బెయిల్ కోసం ఎమ్మెల్సీ కవిత సుప్రీం కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. కవిత పిటిషన్ ను జస్టిస్ గవాయ్, జస్టిస్ విశ్వ నాథన్ ల ధర్మాసనం విచారించింది. కవిత తరపున సీనియర్ కౌన్సిల్ ముకుల్ రోహిత్గి హాజరయ్యారు. రోహిత్గి మహిళ, రాజకీయ నాయకురాలు. అయితే ఇవాళ సుమారు 463 సాక్షులను సుప్రీం కోర్టు ధర్మాసనం విచారించారు. ఐదు నెలల నుంచి కవిత జైల్లో ఉన్నారు.

### బీఆర్ఎస్ శ్రేణుల నిరాశ

కాగా.. ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో ఎమ్మెల్సీ కవితకు కూడా బెయిల్ వస్తుందని బీఆర్ఎస్ శ్రేణులు భావించాయి. పక్కాగా కవితకు సుప్రీం కోర్టులో బెయిల్ వస్తుందని అందరూ భావించారు. కానీ కవిత బెయిల్ పై సుప్రీం కోర్టులో కూడా చుక్కెదురైంది. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు నిరాశ చెందారు. ఇవాళ సుప్రీం కోర్టులో విచారణ అనంతరం ఆగస్టు 20కి వాయిదా వేసింది.